సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం : 29 : మార్చి : 2025



వివాహిత మృతి

జంగారెడ్డిగూడెం మండలంలోని పేరంపేట గ్రామంలో ఆత్మహత్యకు పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ మృతిచెందింది.

IIలో ▸



ఉగాది ఉషస్సులు

ఉగాది వేడుకలకు ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రం ముస్తాబవుతోంది. ఏటా శ్రీవారి వైభవాన్ని చాటేలా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు.

IIలో ▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శనివారం (సాయంత్రం)	సహరి ఆదివారం (ఉదయం)
భీమవరం	6.22	4.40
నరసాపురం	6.22	4.37
తాడేపల్లిగూడెం	6.17	4.48

న్యూస్‌రీల్

పాదుపుపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని ప్రజలకు మెరుగైన జీవనోపాధులను కల్పించడంతో పాటు పాదుపుపై విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఇటీవల అమరావతిలో జరిగిన ముఖ్యమంత్రి కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ప్రస్తావించిన అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు 582 మంది గైర్హాజరు

భీమవరం: జిల్లాలో శుక్రవారం నిర్వహించిన పదో తరగతి జీవశాస్త్ర పరీక్షకు 582 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఈఓ ఈ.నారాయణ తెలిపారు. 23,820 మంది విద్యార్థులకు 23,238 మంది హాజరయ్యారన్నారు. అలాగే ఎస్ఎస్‌సీ (ఏపీఓఎస్ఎస్) సాంఘికశాస్త్ర పరీక్షకు 460 మందికి 359 మంది హాజరయ్యారని, ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈఓ తెలిపారు.

అంకితభావంతో పనిచేయాలి

భీమవరం: అధికారులు అంకితభావంతో పని చేస్తే అభివృద్ధి, సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో పేదలకు చేరుతాయని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. శుక్రవారం స్థానిక విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో ఆయన అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది జిల్లా అధికారుల తరఫున వారి ప్రతినిధులను పంపడంపై అసహనం వ్యక్తం చేశారు. అధికారులు ప్రొటోకాల్ నిబంధనల మేరకు పనిచేయాలన్నారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రగతిపై శాఖల వారీగా సమీక్షించారు. ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, డీఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్డీఓ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ జేడీ జెడ్. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

1న సోషల్ పరీక్ష

భీమవరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల షెడ్యూల్ ప్రకారం ఈనెల 31న నిర్వహించాల్సిన సోషల్ పరీక్షను రంజాన్ సందర్భంగా ఏప్రిల్ 1న నిర్వహిస్తామని డీఈఓ ఈ.నారాయణ తెలిపారు. జిల్లాలోని డీవైఈఓలు, ఎంఈఓలు, హెచ్‌ఎంలు సమాచారాన్ని అందరికీ తెలియజేయాలని సూచించారు.

30, 31 తేదీల్లోనూ రిజిస్ట్రేషన్ సేవలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆర్థిక సంవత్సరం ముగింపు దృష్ట్యా రిజిస్ట్రేషన్ శాఖ ఈనెల 30, 31 తేదీల్లో కూడా ప్రజలకు సేవలు అందిస్తుందని జిల్లా రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే ఏప్రిల్ 2 నుంచి స్లాట్ బుకింగ్ విధానంలో రిజిస్ట్రేషన్ సేవలు అందిస్తామని, ప్రజలు నిర్ణీత వేళల్లో రిజిస్ట్రేషన్ సేవలు పొందవచ్చన్నారు.

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ సంయుక్త కార్యదర్శిగా రాంబాబు



కంబాల రాంబాబు

ముసునూరు: వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల కమిటీ నియామకాల్లో ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మండలంలోని కాట్రేనిపాడు గ్రామానికి చెందిన కంబాల రాంబాబు నియమితులయ్యారు. పార్టీ ఆవిర్భావం నుంచి నూజివీడు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావుకు అతి ముఖ్య అనుచరుడిగా ఆయన ఉన్నారు. శుక్రవారం రాంబాబు మాట్లాడుతూ శక్తి వంచన లేకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

టీటీసీ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు(ఆర్ఆర్‌పేట): టీటీసీ 42 రోజుల ట్రైనింగ్ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఏలూరు డీఈఓ ఎం.వెంకటలక్ష్మమ్మ ప్రకటనలో తెలిపారు. విశాఖ, కాకినాడ, గుంటూరు, కడప, అనంతపురంలో శిక్షణ ఇస్తారని, వచ్చేనెల 3 నుంచి 25లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయన్నారు. 2025 మే 1 నాటికి 18–45 ఏళ్లలోపు వయసున్న వారు అర్హులని తెలిపారు. పదో తరగతి, టీటీసీ లోయర్ పూర్తిచేసిన వారు అర్హులన్నారు.

నిజాయతీగా నిలబడ్డారు

కుట్రలను చీల్చుకుంటూ..

- ఎంపీపీ ఉప ఎన్నికల్లో కూటమి ప్రలోభాలు, బెదిరింపుల పర్వం
- అత్తిలిలో ఎంపీటీసీ సభ్యులకు రూ.10 లక్షల వరకు ఆఫర్
- యలమంచిలిలోనూ ప్రలోభాల ఎర
- తలొగ్గని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు
- విశ్వసనీయత వెంటే నడిచిన వైనం



అత్తిలిలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుతో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు



యలమంచిలిలో ఎన్నికకు హాజరవుతున్న వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు

సాక్షి, భీమవరం: పశ్చిమగోదావరి జిల్లాలోని అత్తిలి ఎంపీపీ, వైస్ ఎంపీపీ, యలమంచిలి ఎంపీపీ పదవులకు ఈనెల 27న జరగాల్సిన ఉప ఎన్నికలను కూటమి నేతల ఆదేశాలతో పచ్చమూకలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ అడ్డుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారానికి వాయిదా పడిన ఎన్నికల్లో అయినా ఎంపీపీ పదవులు దక్కించుకోవాలని ఆయా నియోజకవర్గ నేతలు పావులు కదిపినా ఫలితం లేకపోయింది. తమకు సరిపడినంత మంది సభ్యుల బలం లేకపోయినా భయపెట్టో, ప్రలోభాలకు గురిచేసి అయినా తమకు అవసరమైన మెజార్టీ సభ్యులను లాక్కునేందుకు చేసిన కుయుక్తులు ఫలించలేదు. వాస్తవానికి ప్రస్తుతం అత్తిలి మండలంలో 19 ఎంపీటీసీ స్థానాలకు వైఎస్సార్‌సీపీకి 13 సభ్యుల సంఖ్యాబలం ఉండగా, కూటమికి ఆరుగురే ఉన్నారు. యలమంచిలిలో 17 మందికి గాను వైఎస్సార్‌సీపీకి 12 మంది ఉండగా, కూటమికి ఐదుగురు మాత్రమే ఉన్నారు. ఎన్నికలు జరిగితే వైఎస్సార్‌సీపీ సభ్యులే ఎంపీపీ, వైస్ ఎంపీపీలుగా ఎన్నిక కావడం లాంఛనమే. గతంలోని పెద్ద మనుషుల ఒప్పందాల ప్రకారం అత్తిలి ఎంపీపీగా రంభ సుజాత, వైస్ ఎంపీపీగా గుమ్మంపాడు ఎంపీటీసీ సభ్యుడు అద్దంకి శ్రీను వైస్ ఎంపీపీగా, యలమంచిలి ఎంపీపీగా వినుకొండ ధనలక్ష్మి ఎన్నిక కావాల్సి ఉంది.

ఏదోక విధంగా లాక్కోవాలని..

ఎంపీపీ పదవులు దక్కించుకునేందుకు సరిపడినంత బలం లేకపోయినా ఏదోక విధంగా తమ కైవసం చేసుకోవాలని ఆయా నియోజకవర్గాలకు చెందిన కూటమి నేతలు పావులు కదిపారు. మెజార్టీ సాధన కోసం తమకు అవసరమైనంత మంది సభ్యులను లాక్కునేందుకు మధ్యవర్తుల ద్వారా రూ.లక్షల్లో ఆశ చూపారు. మీరు సూచించిన వారి వద్ద డబ్బులు ఉంచుతామని, ఎన్నికల్లో తమకు అనుకూలంగా ఓటేసి ఆ డబ్బును తీసుకువెళ్లవచ్చని చెప్పారు. కాంట్రాక్టు వర్కులు ఇస్తామని, రానున్న స్థానిక సంస్థల్లో సర్పంచులుగా అవకాశం కల్పిస్తామని, నామినేటెడ్ పదవులు వేయిస్తామంటూ రకరకాలుగా ఆశ చూపారు. మీ పార్టీలోని కొంతమంది మాకు టచ్‌లో ఉన్నారని, మీరు వస్తే సరిపోతుందంటూ నమ్మించే ప్రయత్నం చేశారు. అత్తిలిలో రూ.10 లక్షల వరకు ఆఫర్ ఇచ్చినట్టు ఎంపీటీసీ సభ్యుడు ఒకరు తెలిపారు. చివరకు బ్లాంక్ చెక్ కూడా ఇస్తామని మధ్యవర్తుల ద్వారా కబురు పంపారని చెప్పారు.

కుయుక్తులు ఫలించకపోవడంతో..

తమ కుయుక్తులు ఫలించకపోవడంతో కూటమి నేతలు చివరికి బెదిరింపులకు దిగారు. అత్తిలికి కాబోయే ఎంపీపీ రంభ సుజాతకు చెందిన పెట్రోల్ బంకులపై విజిలెన్స్ అధికారులతో తనిఖీలు చేయించారు. వైఎస్సార్‌సీపీ సభ్యులను తమవైపు తిప్పుకునేందుకు సామ, దాన, భేద, దండోపాయాలను ప్రయోగించారు. ఎవరెన్ని ప్రలోభాలకు గురిచేసినా, ఎంత ఒత్తిడి చేసినా వైఎస్సార్‌సీపీ సభ్యులు ఎక్కడా వారి ప్రలోభాలకు లొంగకుండా నీతిగా, నిజాయతీగా నిలబడ్డారు. తాము వైఎస్సార్‌సీపీ ద్వారా గెలిచామని, ఆ పార్టీలోనే కొనసాగుతామని తేల్చిచెప్పారు. చేసేది లేక ఓటమి నుంచి తప్పించుకునేందుకు కూటమి మూకలు దౌర్జన్యకాండ సాగించారు. గురువారం అత్తిలిలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు నివాసం నుంచి వైఎస్సార్‌సీపీ సభ్యులు బయటకు రాకుండా నిర్బంధించగా.. శుక్రవారం సైతం సభ్యులు ఎవరూ ఎన్నికకు హాజరుకాకుండా అత్తిలికి వచ్చే దారులన్నింటినీ దిగ్బంధించారు. యలమంచిలిలో ముందు రోజు మాదిరి రెండో రోజు కూడా హైడ్రామాను కొనసాగించి రెండు చోట్లా ఎన్నికలు జరగకుండా అడ్డుకున్నారు.

బ్లాంక్ చెక్ ఇస్తామని వల



జెంటిల్‌మెన్ ఒప్పందం ప్రకారం ఇప్పుడు నేను ఎంపీపీగా ఎన్నిక కావాల్సి ఉంది. వైఎస్సార్‌సీపీ గెలవకూడదన్న ఉద్దేశంతో మా సభ్యులను లాక్కునేందుకు కూటమి నాయకులు ఎన్నో అడ్డదారులు తొక్కారు. మా సభ్యులకు బ్లాంక్ చెక్‌లు ఇస్తామని, ఎన్నో ప్రలోభాలకు గురిచేసినా మా వాళ్లు అందరూ ఎంతో నిజాయతీగా నిలబడ్డారు.

– రంభ సుజాత, ఎంపీటీసీ సభ్యురాలు, అత్తిలి

విలువల్ని వదిలేశారు



ఎన్నికల్లో కూటమి ఏ మాత్రం గెలిచే అవకాశం లేకపోయినా ప్రజాస్వామ్య విలువల్ని ఆ పార్టీలో నేతలు పూర్తిగా వదిలేశారు. మా ఎంపీటీసీ సభ్యులను మభ్యపెట్టి ఎంపీపీ పదవిని కాజేయాలని చూశారు. వారు గెలవమని తెలిసి నేను ఎంపీపీ కాకుండా ఎన్నికను అడ్డుకున్నారు.

– వినుకొండ ధనలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు, యలమంచిలి

ప్రాణం ఉన్నంత వరకూ వైఎస్సార్‌సీపీలోనే..



స్టేషన్ నుంచి వచ్చిన కంబాల సత్యశ్రీని ఓదారుస్తున్న సహచర సభ్యులు

మా కుటుంబానికి వైఎస్సార్ అంటే ప్రాణం.. నా భర్త చివరి వరకూ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే నడిచారు.. ప్రాణం ఉన్నంత వరకు నేను జగన్ వెంటే ఉంటాను తప్ప పార్టీని మాత్రం వీడను.. అంటూ తేల్చిచెప్పారు యలమంచిలి మండలం గుంపర్రు వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యురాలు కంబాల సత్యశ్రీ. ఎంపీపీ ఎన్నిక కోసం శుక్రవారం ఉదయం మండలపరిషత్ కార్యాలయానికి వచ్చిన ఆమెను.. మీరు కనిపించడం లేదని మీ కుమార్తె ఫిర్యాదు చేశారంటూ పోలీసులు స్టేషన్‌కు తీసుకువెళ్లారు. అక్కడ కుటుంబసభ్యుల ద్వారా తమకు అనుకూలంగా ఓటు వేయాలని కూటమి నేతలు ఆమెను ఒప్పించే ప్రయత్నం చేశారు. మీరు గట్టిగా ఒత్తిడి చేస్తే ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోతానే తప్ప పార్టీని వీడనని సత్యశ్రీ తేల్చిచెప్పారు. దీంతో పోలీసులు ఆమెను తిరిగి మండలపరిషత్ కార్యాలయం వద్ద దింపి వెళ్లగా జరిగిన సంఘటనను సహచర సభ్యులకు సత్యశ్రీ కన్నీటి పర్యంతమవుతూ వివరించారు.

అత్తిలిలో ఆరిమిల్లి ఫ్యాక్షనిజం

మాజీ మంత్రి కారుమూరి మండిపాటు



తణుకు అర్బన్, అత్తిలి: ప్రశాంతంగా ఉండే తణుకు నియోజకవర్గానికి ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఫ్యాక్షనిజాన్ని పరిచయం చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్తిలి ఎంపీటీసీలను ఓటు హక్కు వినియోగించుకోనీయకుండా అడ్డుపడటం బాధాకరమని అన్నారు. అత్తిలిలోని తన నివాసంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అత్తిలిలో రౌడీ మూకలతో ఇళ్లపై దాడులు చేయించే పరిస్థితిని ఎమ్మెల్యే రాధాకృష్ణ తీసుకువచ్చారని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీకి తిరుగులేని మెజార్టీ ఉండటంతో ఎంపీపీ ఉప ఎన్నికను నిలిపివేసే కుట్ర చేశారన్నారు. ఇంతచేసి నీవు ఏమి సాధించావంటూ ఆరిమిల్లిని ప్రశ్నించారు. ఇన్‌చార్జి ఎంపీపీగా వైఎస్సార్‌సీపీ నాయకుడే ఉన్నారని గుర్తుచేశారు. ఇప్పటికే తణుకు ప్రాంతాన్ని ఎమ్మెల్యే భ్రష్టుపట్టించారని, మద్యం ఏరులై పారిస్తున్నారని, పేకాట స్థావరాలు వెలిశాయని, క్రికెట్ బెట్టింగులు, గుండాటలతో యువతను చెడు మార్గంలో నడిచేలా చేస్తున్నారని దుయ్యబట్టారు. గురువారం రౌడీ మూకలతో తన ఇంటిని ముట్టడించారని, శుక్రవారం ఉపాధి హామీ కూలీలైన మహిళలను మీటింగ్ పేరుతో తీసుకొచ్చి తన వీధిలో నిలబెట్టారని ధ్వజమెత్తారు. వీటి ద్వారా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారే తప్ప ఏం సాధించారంటూ మండిపడ్డారు. అత్తిలిలో తమ ఎంపీటీసీ సభ్యులు నీతికి, నిజాయతీకి కట్టుబడి ఉన్నారని, కూటమి నేతలు ఎన్ని ప్రలోభాలు పెట్టినా లొంగలేదని కారుమూరి ఈ సందర్భంగా ప్రశంసించారు.

పసుపు చొక్కాలు వేసుకున్నట్టుగా పోలీసులు

టీడీపీ పసుపు చొక్కాలు వేసుకుని పోలీసు యంత్రాంగం విధులు నిర్వర్తిస్తున్నారని కారుమూరి ధ్వజమెత్తారు. ఎన్నికల కేంద్రానికి వెళ్లేందుకు రక్షణ కల్పించాలని, ఇంటి పైకి వచ్చి దాడులు చేస్తున్నారని పోలీసు అధికారులకు ఫోన్‌లు చేస్తుంటే ఇదిగో అదిగో అన్నారని, తరువాత ఫోన్‌లు లిఫ్ట్ చేయడం మానేశారని చెప్పారు. లైవ్‌లో రాష్ట్ర డీజీపీ, డీఐజీ, ఎస్పీలకు ఫోన్‌లు చేసి.. వారు స్పందించకపోవడాన్ని మీడియా సాక్షిగా చూపించారు. పోలీసుల తీరు ఇలా ఉందని, నా ఫోన్ లిఫ్ట్ చేయకపోతే సాధారణ మనుషులకు ఎలా న్యాయం చేయగలరని ఈ సందర్భంగా ఆయన విమర్శించారు.

ఇంటిపైకి వచ్చిన వారిని వదిలేది లేదు

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అత్తిలిలో రౌడీమూకల దాడిచేసిన వైనాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని కారుమూరి స్పష్టం చేశారు. న్యాయపరంగా కేసులు నమోదు చేసి తామేంటో చూపిస్తామని హెచ్చరించారు. ఇప్పటికే తన ఇంటి పైకి వచ్చిన రౌడీమూకలకు సంబంధించి పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టానన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు అద్దాల జానకి, వైస్ ఎంపీపీ అద్దంకి శ్రీను, ఎంపీటీసీ సభ్యులు రంభ సుజాత, సుంకర నాగేశ్వరరావు, దొమ్మేటి రమ్య, గుడిమెట్ల ధనలక్ష్మి, పురుషోత్తపు నాగేంద్ర శ్రీనివాస్, అడారి శ్రీనివాసరావు, దారం శిరీష, నల్లమిల్లి నాగమణి, సరకడం రామలింగ విష్ణుమూర్తి, కురాకుల లక్ష్మి, ముదునూరి దుర్గాభవాని, అన్నిశెట్టి త్రిమూర్తులు పాల్గొన్నారు.

ప్రలోభాలు.. బెదిరింపులు

- కూటమికి దక్కిన కైకలూరు వైస్ ఎంపీపీ పదవి
- కక్కిన కూడు వంటిదని ఘాటుగా విమర్శించిన డీఎన్నార్
- ఒకే ఒక్క ఎంపీటీసీ బలం ఉన్నా కూటమి విజయం
- భుజబలపట్నం వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ నిర్బంధం



కైకలూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద కూటమి ఎంపీటీసీ సభ్యులు

కైకలూరు: ప్రలోభాలు.. బెదిరింపులు.. నిర్బంధాలు ఇవి కై కలూరు వైస్ ఎంపీపీ ఎన్నికల్లో కూటమి అనుసరించిన విధానాలు. ఒకే ఒక్క టీడీపీ ఎంపీటీసీ ఉన్నా కూటమి పార్టీలోని జనసేన వైస్ ఎంపీపీ పదవిని కుయుక్తులతో దక్కించుకుంది. వాస్తవానికి వైఎస్సార్‌సీపీ పాలనలో కైకలూరు మండలంలో 22 ఎంపీటీసీ స్థానాలకు కేవలం తామరకొల్లు ఎంపీటీసీ మాత్రమే టీడీపీ గుర్తుపై గెలిచింది. మిగిలిన 21 స్థానాలు వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంది. ఎంపీపీగా అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ–1గా మహమ్మద్ జహీర్, వైస్ ఎంపీపీ–2గా తెంటు సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఎన్నికల ముందు వైఎస్సార్‌సీపీకి చెందిన కైకలూరు–2 ఎంపీటీసీ మంగినేని రామకృష్ణ జనసేనలో చేరి కూటమి పార్టీ విజయానికి పని చేశాడు. కూటమి విజయం తర్వాత ఎంపీపీ అడవి కృష్ణ బీజేపీలో, వేమవరప్పాడు ఎంపీటీసీ బోడావుల తిరుపతిరాజు టీడీపీలో చేరారు. ఇటీవల వైస్ ఎంపీపీ–2 తెంటు సత్యనారాయణ మరణించడంతో వైస్ ఎంపీపీ ఎన్నిక అనివార్యమయ్యింది. ఈ నేపథ్యంలో ఆరుగురు వైఎస్సార్‌సీపీ సభ్యులను కూటమి నేతలు పార్టీ కండువాలు కప్పి చేర్చుకున్నారు. ఎంపీపీ, ఇద్దరు ఎంపీటీసీలు పార్టీలో చేరిన ఆరుగురు ఎంపీటీసీలతో కలిసి 9 మంది వైఎస్సార్‌సీపీ నుంచి వచ్చిన వారు కూటమిలో ఉన్నారు. వీరికి ఒకే ఒక్క టీడీపీ ఎంపీటీసీ తోడవడంతో 10 మందితో కోరం పూర్తయ్యింది. దీంతో జనసేన ఎంపీటీసీ మంగినేని రామకృష్ణ శుక్రవారం వైస్ ఎంపీపీగా ఎన్నికయ్యారు.

కూటమి ప్రభుత్వ దౌర్జన్యాలు

వైస్ ఎంపీపీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం సామ, దాన, భేద, దండోపాయాలను ఉపయోగించింది. వైఎస్సార్‌సీపీకి మిగిలిన 10 మంది ఎంపీటీసీల్లో వైస్ ఎంపీపీ–1 మహమ్మద్ జహీర్ ఏకంగా మచిలీపట్నం ఒలో సీఈఓకు రాజీనామా సమర్పించారు. వైఎస్సార్‌సీపీకి చెందిన కొట్టాడ ఎంపీటీసీ సిద్దాబత్తిన సువర్ణమ్మ బతుకుదెరువు కోసం కువైట్‌లో ఉంటుంది. ఆమెను ఓటింగ్ నిమిత్తం తీసుకురాగా ఆమె పరిషత్ సమావేశాలకు హాజరుకాదని అనర్హత వేటు వేయడానికి సిద్ధమయ్యారు. ఇదిలా ఉంటే భుజ బలపట్నం ఎంపీటీసీ సభ్యుడు పెన్మత్స సూర్యనారాయణరాజు ఈనెల 27న ఓటింగ్‌కు రావాల్సి ఉండగా కూటమి నేతలు అడ్డుకున్నారు. విషయం తెలుసుకుని వెళ్లిన నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కారుకు మరో రెండు కార్లు అడ్డుపెట్టి నిరసన తెలిపారు. పోలీసులు డీఎన్నార్‌ను పంపించివేశారు. ఈ స మయంలో కూటమి నేతలు ఎంపీటీసీలను ఇబ్బంది పెడుతున్న దృశ్యాలను చిత్రీకరిస్తున్న భవ్య న్యూస్ రిపోర్టర్ కురెళ్ల కిషోర్‌ను చావబాదారు. సెల్‌ఫోన్ లాక్కొని ఇప్పటికీ ఇవ్వలేదు.

కక్కిన కూడుకు కక్కుర్తి: డీఎన్నార్

కూటమి నేతలు వైఎస్సార్‌సీపీ గుర్తుతో గెలిచిన ఎంపీటీసీలను లాక్కొని కక్కిన కూడుకు కక్కుర్తి పడ్డారని వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, జిల్లా పార్టీ అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) తీవ్రంగా విమర్శించారు. ప్రధానంగా కైకలూరు రూరల్ సీఐ వి.రవికుమార్‌కు భుజబలపట్నంలో ఎంపీటీసీని రాకుండా అడ్డుకుంటున్నారని చెప్పినా స్పందించలేదన్నారు. ఆయనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. అనంతరం ఆయన ఇంటి వద్ద వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు 9 మందిని ఘనంగా సన్మానించారు. వైఎస్సార్‌సీపీ ముదిరాజుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధనరావు, జిల్లా ఉపాధ్యక్షుడు చేబోయిన వీర్రాజు, ఎంపీపీలు పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, రామిశెట్టి సత్యనారాయణ, నాయకులు మహాదేవ విజయబాబు, మోట్రూ అర్జునరావు, జయమంగళ కాసులు, ముంగర నరసింహారావు, ఈదా మురళీకృష్ణ, పాము రవికుమార్, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

కూటమి కుట్రలో ఉపాధి కూలీల మోహరింపు



అత్తిలిలో మాజీ మంత్రి కారుమూరి నివాసం రోడ్డులో ఉపాధి కూలీలు

తణుకు అర్బన్: అత్తిలి ఎంపీపీ ఉప ఎన్నికలో ఎంపీటీసీ సభ్యులను అడ్డుకునే క్రమంలో కూటమి నాయకులు ఉపాధి హామీ పథకం కూలీలను అస్త్రంగా ఎంచుకున్నారు. అత్తిలి ప్రధాన రహదారులు, కూడళ్లలో పురుష కూలీలను, మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు నివాస రహదారికి ఇరువైపులా మహిళా కూలీలను మోహరింపజేశారు. ఇలా సుమారు 500 మందికిపైగా కూలీలను తీసుకువచ్చి వీధుల్లో నిలబెట్టారు. మీటింగ్ ఉందని చెప్పి తమను తీసుకువచ్చారని, తీరా ఇక్కడికి వచ్చిన తర్వాత ఇంట్లోంచి వచ్చే మహిళలను పట్టుకోవాలని చెప్పారంటూ మహిళా కూలీలు 'సాక్షి' వద్ద వాపోయారు. కూటమి నేతలు పిలిచినా రాకపోతే ఉపాధి పనుల్లోకి రాకుండా చేస్తారనే భయంతోనే ఇక్కడకు వచ్చామని చెప్పారు. తమకు రూ.500, బిర్యానీ పొట్లం ఇస్తామని చెప్పారని కొందరు కూలీలు అన్నారు. కూలీల మస్తరును సైతం కూలీల్లో ఒకరు వేస్తూ ఉండటంపై ప్రశ్నించగా కూలీల పేర్లు నమోదు చేయమని కూటమి నేతలు చెప్పారని చెప్పడం ఆశ్చర్యం కలిగించింది. కూలీలకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనాలు, పుచ్చకాయ ముక్కలను కూటమి నేతలు పంచారు. మండుటెండలో మహిళా కూలీలను రోడ్లపై కూర్చోబెట్టడంతో పలువురు నీరసంతో కూలబడిపోయారు. చివరకు ఎన్నిక ప్రక్రియ ముగిసిన తర్వాత కొందరికి రూ.500, మరికొందరికి రూ.300 చొప్పున ఇవ్వడంపై కూలీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ కూలీలను స్వార్థ రాజకీయాలకు వాడుకోవడంపై అత్తిలి ప్రజలు విస్మయం వ్యక్తం చేశారు.

భీమవరంలో క్రిటికల్ కేర్ యూనిట్



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

భీమవరం: భీమవరంలో అత్యవసర వైద్య సేవలందించడానికి క్రిటికల్ కేర్ ప్రత్యేక వైద్య విభాగం ఏర్పాటుకు ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పథకంలో రూ.23.75 కోట్ల నిధులు మంజూరయ్యాయని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ చెప్పారు. శుక్రవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భీమవరం ఏరియా ఆస్పత్రిలో 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్‌కు ఏప్రిల్‌లో శంకుస్థాపన చేస్తామన్నారు. అమృత భారత్ స్టేషన్ పథకంలో రాష్ట్రంలో 72 రైల్వే స్టేషన్లను గుర్తించగా వాటిలో భీమవరం, నరసాపురం తాడేపల్లిగూడెం స్టేషన్లకు సుమారు రూ.84 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. భీమవరం స్టేషన్‌లో ఇప్పటికే 55 శాతం పనులు పూర్తి చేసినట్టు చెప్పారు. నరసాపురం నుంచి నాగర్‌సోల్ వెళ్లే ఎక్స్‌ప్రెస్‌కు వీరవాసరంలో, వందే భారత్ రైలును మెయిన్ లైన్‌లో తాడేపల్లిగూడెంలో హాల్ట్ ఇవ్వడానికి కృషి చేస్తున్నామన్నారు. ఆకివీడు–దిగమర్రు బైపాస్ రోడ్డు పనులు త్వరితగతిని చేపట్టేలా చర్యలు తీసుకున్నామని కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ చెప్పారు.

భూ సర్వే రికార్డుల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

పెనుగొండ: భూ సర్వేలు రైతు సమక్షంలో నిర్వహించి వారికి సంతృప్తి కలిగించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పెనుగొండ మండలంలో పైలెట్ గ్రామం దేవలో ట్రూతింగ్ పనులు పూర్తి చేసిన అనంతరం హెచ్చుతగ్గులపై రైతులు దరఖాస్తు చేసుకోవడంతో వాటిని పరిశీలించారు. భూయజమానితో మాట్లాడుతూ కొలతల్లో ఎటువంటి పొరపాటు లేదని, రికార్డుల ప్రకారం కచ్చితంగా భూమి ఉందని పిటిషన్‌దారుడు, సరిహద్దుదారుడుకు వివరించారు. అనంతరం వరి చేలను పరిశీలించారు. ప్రభుత్వం రైతులను అన్నివిధాలా ఆదుకోవడానికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తోందన్నారు. కోతలు కోసిన తర్వాత ధాన్యాన్ని రెండు రోజులు ఆరబెట్టి రైతు సేవా కేంద్రాలకు తరలించాలన్నారు. తహసీల్దార్ జి.అనితకుమారి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రూఅప్ చార్జీలపై నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యుత్ ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై భారాలు మోపొద్దని, వాటిని రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర సీపీఎం పార్టీ పిలుపు మేరకు శుక్రవారం పట్టణంలోని జయలక్ష్మి థియేటర్ సమీపంలోని సౌత్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టి ఏఈకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరుతో మరోసారి ప్రజలపై భారాలు మోపాడాన్ని ఖండించారు. స్మార్ట్‌మీటర్లు బిగించడాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. నాయకుడు కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ ప్రజలపై విద్యుత్ భారాలను మోపితే ప్రశ్నిస్తామని, ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

శ్రీవారి హుండీ ఆదాయం లెక్కింపు



హుండీల నగదును లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయ హుండీల నగదు లెక్కింపు స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో శుక్రవారం కట్టుదిట్టమైన భద్రత నడుమ జరిగింది. ఈ లెక్కింపులో చినవెంకన్నకు విశేష ఆదాయం సమకూరింది. గత 11 రోజులకు నగదు రూపేణా స్వామికి రూ.86,52,879 ఆదాయం లభించినట్టు ఆలయ ఈఓ ఎన్వీ సత్యనారాయణ మూర్తి తెలిపారు. కానుకల రూపేణా భక్తులు సమర్పించిన 103 గ్రాముల బంగారం, 2.075 కేజీల వెండితో పాటు, అధికంగా విదేశీ కరెన్సీ లభించిందన్నారు. లెక్కింపులోకిరాని రద్దయిన పాత రూ.2000, రూ.1,000, రూ.500 నోట్ల ద్వారా రూ.28,500 లభించినట్టు చెప్పారు.

రేపటి నుంచి నవరాత్రి ఉత్సవాలు



ద్వారకాతిరుమల క్షేత్ర దేవత కుంకుళ్లమ్మ వారు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి ఉపాలయమై, క్షేత్ర దేవతగా విరాజిల్లుతోన్న శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. వచ్చేనెల 7 వరకు జరగనున్న ఈ ఉత్సవాలను పురస్కరించుకుని నిత్యం ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు జరుగనున్నాయి. అందులో భాగంగా తొలిరోజు ఉగాది నాడు అమ్మవారు లక్ష గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ ఈఓ ఎన్వీ సత్యనారాయణ మూర్తి తెలిపారు. అమ్మవారికి కుంకుమ పూజలు, చండీ హోమం వంటి కార్యక్రమాలు జరుగుతాయని, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

కొనసాగుతున్న డయాఫ్రం వాల్ పనులు : నిమ్మల

పాలకొల్లు సెంట్రల్: పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్ పనులు రూ.990 కోట్ల వ్యయంతో జరుగుతున్నాయని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. శుక్రవారం పాలకొల్లులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు 2014–19లో పోలవరం ప్రాజెక్టును 72 శాతం పూర్తిచేసినట్టు చెప్పారు. నిర్వాసితులకు రూ.829 కోట్లు ఖాతాల్లో జమ చేసినట్టు తెలిపారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వివాహిత ఇచ్చిన ఫిర్యాదుపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. పట్టణంలోని రాజులకాలనీకి చెందిన గెడ్డం వీరేంద్రకుమార్ రాజాకు, రమ్య మధురికకు 2016లో ప్రేమ వివాహం జరిగింది. ఈ నెల 23 నుంచి వీరేంద్రకుమార్ రాజా అధిక కట్నం కోసం మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడన్నారు. దీనికి అతని కుటుంబసభ్యులు సహకరిస్తున్నారని, ఈ నెల 27 రాత్రి వీరేంద్రకుమార్ రాజా కట్నం తేవాలని భార్య రమ్య మధురికను కొట్టి ఇంటి నుంచి గెంటివేశాడన్నారు. దీంతో శుక్రవారం రమ్య మధురిక ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉగాది ఉషస్సులు

రేపు చినవెంకన్న క్షేత్రంలో వేడుకలు

ద్వారకాతిరుమల: పెద్ద పండుగల్లో అత్యంత విశిష్టమైన పండుగ ఉగాది. ఆ రోజుతోనే కొత్త సంవత్సరం ప్రారంభమవుతుంది. ఇది ముఖ్యంగా తెలుగు వారి పండుగ. ఆంగ్ల సంవత్సరం డిసెంబర్ 31తో ముగుస్తుంది. కొత్త సంవత్సరం జనవరి 1తో ప్రారంభమవుతుంది. దీనికి సూచికగా పాత క్యాలెండర్ తీసేసి, కొత్త క్యాలెండర్‌ను తగిలించుకుంటాం. అంతకంటే పర్యావరణంలో, పరిసరాల్లోను ఏ విధమైన మార్పు కనిపించదు. తెలుగు సంవత్సరాది అలా కాదు. ప్రకృతిలో, వాతావరణంలో పెద్ద మార్పు గమనించవచ్చు. తెలుగు సంవత్సరం శిశిర రుతువు ఫల్గుణ అమావాస్యతో ముగుస్తుంది. మరునాడు చీకట్లు పోయి వెలుగులు పెరిగే శుక్ల పాడ్యమితో కొత్త సంవత్సరం మొదలవుతుంది. పాత సంవత్సరపు చీకటి అనుభవాల నుంచి ఆనందపు వెలుగుల్లోకి వెళ్లువలా మనం అడుగు వేస్తాం. వృక్షాలు కొత్త చిగుళ్లతో, ఆకుపచ్చ శోభతో, లేత మామిళ్లు, వేప పువ్వుల పరిమళాలు, ఫల, పుష్ప, వృక్షాల గుబాళింపులతో ప్రకృతి ఆహ్లాదపరుస్తూ ఉంటుంది. పక్షుల కిలకిల రావాలు, కోయిల పాటలు వీనుల విందు చేస్తూ వినిపిస్తాయి. ఆనందపు హరివిల్లు చేతబట్టి, వయ్యారంగా, రమణీయంగా తొలి వెలుగులలో.. చిరు నగవులతో.. తెలుగువారింట ఉగాది ప్రవేశిస్తుంది.





శ్రీవారు, అమ్మవార్ల ఉత్సవమూర్తులు

క్షేత్రంలో ఉగాది మండపం, పరిసర ప్రాంతాలకు అలంకారాలు చేస్తున్న సిబ్బంది

శ్రీవారికీ ఇదే తొలి ఉత్సవం

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్నకు ఉగాది పండుగే తొలి ఉత్సవం. అందుకే ఈ పండుగకు క్షేత్రంలో ప్రత్యేక స్థానం ఉంది. ఏటా శ్రీవారి వైభవాన్ని చాటేలా ఈ ఉత్సవాలను ఆలయ అధికారులు నిర్వహిస్తారు. అందులో భాగంగా ఈ నెల 30న సాయంత్రం 6 గంటలకు ఉభయ దేవేరులతో స్వామివారు ఆలయం నుంచి వెండి శేషవాహనంపై బయల్దేరి, ఉగాది మండపం వద్దకు చేరుకుంటారు. అనంతరం మండపంలో శ్రీవారు, అమ్మవార్లను వేంచేపుచేసి అర్చకులు, పండితులు పంచాంగ శ్రవణాన్ని జరిపి, రాశి ఫలాలను చదివి వినిపిస్తారు. ఆ తర్వాత పండిత సత్కారాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ వేడుకలను పురస్కరించుకుని ఉగాది మండపాన్ని, పరిసరాలను విద్యుద్దీప తోరణాలతో శోభాయమానంగా అలంకరిస్తున్నారు.

ఘనంగా ఉగాది ఉత్సవాలు



ఉగాది ఉత్సవాల్లో డోలు నృత్యాలు

బుట్టాయగూడెం: మండలంలోని మంచులవారి గూడెంలో స్వయంభుగా వెలసి భక్తుల పూజలందుకుంటున్న గుబ్బల మంగమ్మతల్లి, కనకదుర్గమ్మ, నాగమ్మతల్లి, నాగేంద్రుల ఉగాది ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి, స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కోయ గిరిజన సంప్రదాయ నృత్యాలు, డోలు వాయిద్యాలతో బోనం ఎత్తుకుని గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. కోలాటాల ఊరేగింపు కూడా నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉగాది సందర్భంగా అమ్మవారికి పుట్టింటి సారె కావిడ్లతో, నాటు కోళ్లు, మేకపోతులతో మొక్కులు చెల్లిస్తామని ఆలయ పీఠాధిపతి కేరం మధు తెలిపారు.



కనకదుర్గ అమ్మవారిని అలంకరించిన దృశ్యం

కళారత్న అవార్డుకు ఎంపిక

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన ప్రఖ్యాత కూచిపూడి, భరతనాట్యం నాట్య గురువు ఏ.పార్వతీ రామచంద్రన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ అత్యుత్తమ పురస్కారం హంస అవార్డు కళా రత్న పురస్కారానికి ఎంపికయ్యారు. గత 45 ఏళ్లుగా ఏలూరులో కళా దీపిక నృత్య అకాడమీ ద్వారా వేలాదిమంది విద్యార్థులను నాట్య కళాకారులుగా తీర్చిదిద్దిన ఉత్తమ నాట్య గురువు. నాట్య కళాకారిణే కాకుండా మంచి సంగీత కళాకారిణి. ఎన్నో సంస్థలు ఆమెను వివిధ బిరుదులతో, సన్మానాలతో గౌరవించాయి. ఆమె కళారత్న పురస్కారానికి ఎంపికై న సందర్భంగా నగరానికి చెందిన ప్రముఖ నృత్య కళాకారుడు కళారత్న కేవీ సత్యనారాయణ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. పార్వతీ రామచంద్రన్ నృత్య రంగానికి చేస్తున్న విశేష సేవలను గుర్తించి తమ కేవీఎస్ ట్రస్ట్ ద్వారా కేవీ సత్యనారాయణ ప్రతిభా పురస్కారంతో 2022లో పార్వతి రామచంద్రన్‌ను సత్కరించామన్నారు. నాట్యానికి జీవితం అంకితం చేసిన గొప్ప కళాకారిణి పార్వతి రామచంద్రన్‌కు రాష్ట్ర ప్రభుత్వం కళారత్న హంస అవార్డు ఇచ్చి సత్కరిస్తున్నందుకు కళాకారులు ఎంతో సంతోషిస్తున్నారన్నారు.



కళారత్న అవార్డుకు ఎంపికైన నగరానికి చెందిన ఏ. పార్వతీ రామచంద్రన్

గేట్‌లో జయకేతనం

తాడేపల్లిగూడెం: గేట్ 2025లో ఏపీ నిట్ విద్యార్థులు ప్రతిభ చూపి ర్యాంకుల పంట పండించారు. జాతీయ స్థాయిలో సత్తా చాటారు. నిట్‌లో బయోటెక్నాలజీ చదువుతున్న కె.నవ్య 8వ ర్యాంకు, ఈసీఈలో సీహెచ్.దినేష్ 23వ ర్యాంకు, డి వర్ధన్ ఎలక్ట్రికల్‌లో 40వ ర్యాంకు , సీఎస్ఈలో కలిదిండి శ్రీధర్ వర్మ 56వ ర్యాంకు, జియో ఇన్ఫర్మేటివ్ ఇంజనీరింగ్‌లో 102వ ర్యాంకు , ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్‌లో అతిథి అనన్య 164వ ర్యాంకు పొందారు. వందలోపు నలుగురు, 500 లోపు పది మంది, 500 నుంచి వెయ్యి లోపు 12 మంది ర్యాంకులు సాధించారు. వీరిని డీన్ అకడమిక్ డాక్టర్ ఎస్.జయరామ్, గేట్ ఉచిత శిక్షణా కేంద్రం సమన్వయకర్త డాక్టర్ వినోద్‌కుమార్ అభినందించారు. నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ ఎస్.వి.రమణరావు, రిజిస్ట్రార్ దినేష్ శంకరరెడ్డి పర్యవేక్షణలో ఉచిత గేట్ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. బేసిక్స్‌తో పాటు గేట్ పరీక్షను ఎలా రాయాలి, ప్రశ్నలు ఎలా వస్తాయి, వాటికి జవాబులు ఎలా రాయాలి వంటి విషయాలపై ప్రత్యేక తర్ఫీదు నిచ్చి తీర్చిదిద్దుతున్నామన్నారు.



గేట్‌లో ప్రతిభ చూపిన నిట్ విద్యార్థులు

లేగ దూడల ప్రదర్శన

ద్వారకాతిరుమల: మండలంలోని తక్కెళ్లపాడులో పశు సంవర్ధక శాఖ, జిల్లా పశు గణాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. అందులో 25 గేదె దూడలు, 15 ఆవు దూడలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా పశు పోషణ, జాతి లక్షణాల ఆధారంగా రైతులకు బహుమతులను భీమడోలు ఏడీ డాక్టర్ సాయి రమేష్ అందజేశారు. అనంతరం వైద్యులు 4–6 నెలల వయస్సున్న 30 పెయ్యి దూడలకు బ్రూసెల్ల టీకాలు వేశారు. లేగ దూడలు పశు పోషణలో తీసుకోవాల్సిన మెలకువలు, జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆ తరువాత ఈ ప్రదర్శనలో పాల్గొన్న రైతులందరికీ కాల్షియం, లివర్ టానిక్, గోమర్లు మందు, స్టీల్ క్యాన్‌లను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ద్వారకాతిరుమల, భీమడోలు మండలాల పశు వైద్యాధికారులు అంగర సురేష్, హరికృష్ణ, పాడి రైతులు బొల్లారెడ్డి సూర్యనారాయణ రెడ్డి, మానికల రామకృష్ణ, ముల్లంగి కృష్ణారెడ్డి, షేక్ మస్తాన్ సాహెబ్, పశు గణాభివృద్ధి సిబ్బంది, పశు సంవర్థక శాఖ సిబ్బంది, ఏహెచ్ఏలు, గోపాల మిత్రలు పాల్గొన్నారు.



ద్వారకాతిరుమల మండలం తక్కెళ్లపాడులో జరుగుతున్న లేగదూడల ప్రదర్శన

చికిత్స పొందుతూ వివాహిత మృతి

పురుగుల మందు తాగించి పరారైన ప్రియుడు



అనంత ప్రసన్న, మృతురాలు

జంగారెడ్డిగూడెం: మండలంలోని పేరంపేటలో ఆత్మహత్యకు పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ మృతిచెందింది. దీనికి సంబంధించి ఎస్సై షేక్ జబీర్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పేరంపేటకు చెందిన హేమదుర్గా అనంత ప్రసన్నకు, కొయ్యలగూడెం మండలం యర్రంపేటకు చెందిన దార్ల రాంప్రసాద్‌తో 2014లో వివాహమైంది. వీరికి 11 సంవత్సరాల కుమార్తె ఉంది. కొయ్యలగూడెం మండలం గంగన్నగూడెంకు చెందిన మోదుగ పెద్దసాయి.. ప్రసన్నను ప్రేమిస్తున్నానంటూ వెంటపడేవాడు. వారు ఏకాంతంగా ఉన్న సమయంలో ఫొటోలు, వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్ చేసేవాడు. ఫిబ్రవరి 7న ప్రసన్న ఇంటికి వెళ్లి మనిద్దరం చనిపోదాం! అంటూ పురుగుల మందు తాగించాడు. కుటుంబ సభ్యులు ఆమెను కొయ్యలగూడెం ఆసుపత్రికి తీసుకువెళ్లగా, అక్కడ చికిత్స పొందిన తరువాత తండ్రి ఈశ్వరాచారి కుమార్తె ప్రసన్ననను జంగారెడ్డిగూడెం మండలం పేరంపేటకు తీసుకొచ్చాడు. 15 రోజుల తరువాత పెద్ద సాయి పేరంపేటకు వచ్చి గొడవ పడ్డాడు. మార్చి 26న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్రసన్న ఇంటికి వచ్చిన సాయి చనిపోదాం.. అని నమ్మించి ప్రసన్నతో కలుపుమందు తాగించాడు. మందు ప్రభావాన్ని తట్టుకోలేక ప్రసన్న కేకలు వేయగా, ఆమె తల్లి పరుగున అక్కడికి వచ్చింది. ఆమెను చూసిన సాయి అక్కడినుంచి పారిపోయాడు. ప్రసన్నను వెంటనే జంగారెడ్డిగూడెంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 27న చనిపోయింది. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మృతదేహంతో ధర్నా

కొయ్యలగూడెం: ప్రసన్న కుటుంబానికి న్యాయం చేయాలంటూ గంగన్నగూడెంలో బంధువులు ఆందోళన చేపట్టారు. జంగారెడ్డిగూడెం నుంచి గంగన్నగూడెంకు ప్రసన్న మృతదేహాన్ని అంబులెన్స్‌లో తరలిస్తుండగా, పోలీసులు అంబులెన్స్ డ్రైవర్‌కు ఫోన్ చేసి మధ్యలోనే ఆపించారు. దీంతో మృతదేహాన్ని మోటార్‌సైకిల్‌పై గంగన్నగూడెం తీసుకువెళ్లి ధర్నా చేశారు. ప్రసన్న మృతికి గంగన్నగూడెం గ్రామానికి చెందిన సాయి కారణమని అతని ఇంటి ముందు మృతదేహాన్ని ఉంచి ధర్నా చేశారు. ఆ సమయంలో యువకుడితో సహా అతని ఇంట్లో ఎవరూ లేకపోవడంతో బయటే ఉండి ఆందోళన చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి వారితో చర్చించి మృతదేహాన్ని తరలించేలా ఒప్పించారు.



కొయ్యలగూడెం మండలం గంగన్నగూడెంలో ప్రసన్న మృతదేహంతో ధర్నా చేస్తున్న దృశ్యం

రైతులకు అందుబాటులో పీఎండీఎస్ కిట్లు

ద్వారకాతిరుమల: రైతులకు పీఎండీఎస్ కిట్లను అందుబాటులోకి తెచ్చామని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా తెలిపారు. మండలంలోని గుండుగొలనుకుంట ఎస్‌పీఎం షాపులో సిద్ధం చేసిన 2 వేల కిట్లను రైతులకు పంపిణీ చేసే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం హబీబ్ బాషా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఈ కిట్లను సిద్ధం చేసినట్టు చెప్పారు. పచ్చిరొట్ట విత్తనాల్లో 16 రకాల విత్తనాలను కలిపి ఈ కిట్‌ను తయారు చేశామని, వీటిని రుతుపవనాలు వచ్చే ముందు వేయాలన్నారు. మెంతులు, ఆవాలు, తోటకూర తదితర విత్తనాలు కలగలిపి 12 కేజీల బరువుతో ఈ కిట్ ఉంటుందన్నారు. ఈ విత్తనాల ద్వారా సాగు చేయడం వల్ల పశువులకు మేత పుష్కలంగా లభిస్తుందన్నారు. అలాగే ఆకు కూరలు, ఆవాలు, మెంతులను రైతులు విక్రయించుకోవచ్చన్నారు. మొత్తం 10 వేల మంది రైతులకు అందించే లక్ష్యంలో భాగంగా, తొలి విడతగా 2 వేల కిట్లను సిద్ధం చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమడోలు ఏడీఏ ఉషారాజ్ కుమారి, ఏడీపీఎం బాలిన వెంకటేష్, ద్వారకాతిరుమల, భీమడోలు ఏవోలు ఎ.దుర్గారమేష్, ఉషారాణి తదితరులున్నారు.



గుండుగొలనుకుంటలో పీఎండీఎస్ కిట్లను ప్రారంభిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా

ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతి చెందిన కొల్లాబత్తుల యేసు

దెందులూరు: బైక్‌పై వెళ్తూ కిందపడి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొన్న ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారని దెందులూరు ఎస్సై ఆర్ శివాజీ తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి ఆయన తెలిపిన వివరాల ప్రకారం .. శుక్రవారం దెందులూరు గ్రామానికి చెందిన కొల్లా బత్తుల యేసు, గుంపుల వంశీ ద్విచక్ర వాహనంపై శ్రీరామవరం వెళుతున్నారు. గుంపుల వంశీ ద్విచక్ర వాహనాన్ని అతివేగంగా నడుపుతూ కింద పడటంతో కొంత దూరం వెళ్లి ఎదురుగా దెందులూరు వైపు వస్తున్న ఆటోను ఢీకొన్నారు. ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చున్న యేసు మృతి చెందగా గుంపుల వంశీ గాయపడ్డాడు. అతన్ని ఏలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెయ్యి లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



ఓగిరాల తండాలో బెల్లపు ఊట ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

నూజివీడు: మండలంలోని ఓగిరాల తండాలో ఎక్సైజ్ సిబ్బంది శుక్రవారం నిర్వహించిన దాడుల్లో వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేయడంతో పాటు 35 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఏఈఎస్ జీ.పాండురంగారావు తెలిపారు. సంఘటన ప్రాంతం నుంచి పారిపోయిన కృష్ణపై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఈఎస్‌టీఎఫ్ ఎస్ఐ కేఎండీ ఆరిఫ్, సిబ్బంది పాల్గొన్నారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాల్లో ఎవరైనా ఎక్సైజ్ నేరాలకు పాల్పడుతుంటే సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

వృద్ధురాలిని బెదిరించి బంగారం అపహరణ

భీమవరం: ఇళ్లు అద్దెకు కావాలని వచ్చి వృద్ధురాలిని గాయపరిచి మెడలోని బంగారం లాక్కెళ్లి పోయారని సీఐ ఎం.నాగరాజు తెలిపారు. భీమవరం ఒకటో పట్టణంలోని అమ్మిరాజు తోటకు చెందిన యర్రంశెట్టి మంగతాయారు ఇంటికి ఓ వ్యక్తి శుక్రవారం సాయంత్రం వచ్చాడు. బంధుత్వం ఉన్నట్టు నటించాడు. ఇళ్లంతా తిరిగి చూశాడు. కొద్దిసేపు కూర్చొన్న తర్వాత చాకుతో బెదిరించి ఆమె మెడలోని బంగారు ఆభరణాన్ని లాక్కెళ్లిపోయాడు. గాయపడిన వృద్ధురాలి కేకలు విని స్థానికులు వచ్చి ఆమెను చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. సంఘటన స్థలానికి డీఎస్పీ జయసూర్య వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. ఆ ప్రాంతంలోని సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలిస్తున్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం బాలిక అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దిరుసుమర్రు గ్రామానికి చెందిన బాలిక ఈ నెల 26 ఉదయం నుంచి కనిపించడం లేదు. అదే గ్రామానికి చెందిన బేతాల ఆశీర్వాదం బాలికను ప్రేమిస్తున్నానని వెంటబడేవాడంటూ బాలిక మేనమామ ఫిర్యాదు చేశాడని రూరల్ ఎస్సై వీర్రాజు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బిల్డింగ్ నుంచి పడి వ్యక్తి మృతి

కైకలూరు: పడక కుర్చీపై చల్లిగాలికి డాబాపై పడుకున్న వ్యక్తి కింద పడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. రూరల్ పోలీసుల వివరాలు ప్రకారం కైకలూరు మండలం గుమ్మళ్లపాడు గ్రామానికి చెందిన కమతం యేబేలు(58) ఈ నెల 22న డాబాపై రాత్రి పడక కుర్చీలో పడుకున్నాడు. ఉదయం కుటుంబ సభ్యులు చూసేసరికి కింద పడి ఉన్నాడు. వెంటనే కైకలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయించి, విజయవాడ ఆస్పత్రి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మరణించారని పోలీసులు చెప్పారు. కుమార్తె దాసరి రాణి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని తెలిపారు.

ఉపాధి కల్పన కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): ఉపాధి కల్పన పథకంలో లబ్ధి కోసం మైనార్టీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి ఎస్.ఎస్.కృపావరం శుక్రవారం తెలిపారు. ఈ పథకంలో తయారీ రంగానికి రూ.50 లక్షలు, సేవ రంగానికి రూ. 20 లక్షలు సబ్సిడీ రుణం ఇస్తారన్నారు. ఈ పథకంలో నూతన ప్రాజెక్టులకు మాత్రమే రుణం ఇస్తారన్నారు. అభ్యర్థులు సంబంధిత వెబ్‌సైటులో సమాచారాన్ని పూరించి అవసరమైన ధ్రువపత్రాలు జతపర్చాలన్నారు.

పోక్సో కేసు నమోదు

భీమవరం: భీమవరం రెండో పట్టణానికి చెందిన 13 ఏళ్ల బాలిక పట్ల కె.గణేష్ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బాధిత బాలిక తల్లితో కొన్నేళ్లుగా గణేష్ సహజీవనం చేస్తున్నాడు. అందరూ ఒకే ఇంట్లో ఉంటారు. చదువు మానేసి ఇంట్లో ఉంటున్న బాలికపై ఎవరూ లేని సమయంలో శరీరంపై చేతులు వేసేవాడు. ఎవరితోనైనా చెబితే బాగుండదని హెచ్చరించేవాడు. తన తల్లిని శుక్రవారం కొడుతుండగా ఎందుకు కొడుతున్నావని అడిగితే మీద చేతులు వేసి దుర్భాషలాడినట్లు ఫిర్యాదులో పేర్కొనగా ఎస్సై రెహమాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

ప్రమాదం అంచున ప్రజారోగ్యం



ప్రత్తిపాడులో హైవే కింద ఏలూరు కాలువ గట్టున చెత్తను వేసి డంపింగ్ యార్డుగా మార్చిన వైనం



కాగులంపాడు ఎన్టీఆర్ విగ్రహం వద్ద మురుగునీరు నిల్వ ఉన్న దృశ్యం



వల్లూరుపల్లి గ్రామంలో అపరిశుభ్ర వాతావరణం నెలకొన్న దృశ్యం

- రహదారి అంచులే డంపింగ్‌యార్డులు
- విజృంభిస్తున్న దోమలు..
- ప్రబలుతున్న వ్యాధులు
- మచ్చుకైనా కానరాని 'స్వచ్ఛభారత్'
- నియోజకవర్గాన్ని పట్టించుకోని పాలకులు, అధికారులు
- ఏరులై పారుతున్న గ్రామీణ డ్రెయిన్‌లు

పెంటపాడు: పట్టణం..పల్లెలకు వచ్చే వారికి చెత్త స్వాగతం పలుకుతోంది. రోడ్ల పక్కన నిలుచునే పరిస్థితి లేని తీరు కలవరపెడుతోంది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పట్టించుకోకపోవడంతో దయనీయ స్థితి నెలకొంది. ప్రధాన రహదారులు అంచులనే మున్సిపల్, గ్రామ పంచాయతీలు డంపింగ్ యార్డులుగా మార్చేస్తున్నాయి. నియోజకవర్గంలో పట్టణంతో పాటు గ్రామాల్లో రోడ్డు పక్కన ఉన్న చెత్త గుట్టలు, పిచ్చి మొక్కలు పెరిగిపోయి అడవులను తలపిస్తున్నాయి. రోడ్ల మార్జిన్‌లోనే రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపార ప్రకటనకు సంబంధించిన భారీ కటౌట్లు, బ్యానర్లు పెడుతున్నారు. దీంతో నియోజకవర్గంలో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

స్వచ్ఛ సంకల్పానికి తిలోదకాలు

స్వచ్ఛభారత్ లక్ష్యం నెరవేరడం లేదు. ఇప్పుడు కొత్తగా స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ పేరుతో చేపట్టే పారిశుద్ధ్య, కార్యక్రమాలు సైతం ఎక్కడా జరగడం లేదు. చెత్త రహిత వార్డులు, గ్రామాలుగా తీర్చిదిద్దాలనే సంకల్పానికి అధికారులు తిలోదకాలిస్తున్నారు. నిర్వహణ కొరవడి పట్టణం, గ్రామాల్లో రోడ్ల వెంబడి చెత్త పేరుకుపోతుంది. ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటుంది. పారిశుద్ధ్య పనులు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు దుర్వాసనతో సావాసం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పట్టణంలో, గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే పారుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలో పట్టణంలోని, మండలాల్లోని గ్రామాల్లో వీధులు డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగింపుపై అధికారులు ఏమాత్రం దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా చెత్త గుట్టలు గుట్టలుగా పేరుకుపోవడంతో దోమలు, ఈగలు లార్వాల సంతతికి నెలవుగా మారింది. దీంతో స్థానికులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా ప్రత్తిపాడులో విస్తీర్ణం ఎక్కువ కావడంతో గోదాములు, దేవాలయాలు, ఎస్సీపేట, బీసీ ఏరియా, ఆరుగొలనురోడ్డు, కాగులంపాడు ప్రాంతాల్లో నిత్యం చెత్త దర్శనమిస్తూనే ఉంది. వారంలో ఒక్క సారి కూడా చెత్త ట్రాక్టర్ మా వీధికి రావడం లేదని ప్రజలు వాపోతున్నారు. దీంతో పాటు డ్రెయిన్‌లు దుర్గంధం వెదజల్లుతున్నాయి. బీసీ ఏరియాతో పాటు, ఎస్సీ కాలనీలో పలు వీధులు, కాగులంపాడు ఎన్టీఆర్ విగ్రహం పలు ప్రాంతాలలో డ్రెయినేజీలు తీయకపోవడం వల్ల అట్టలు కట్టి దుర్గంధం వెదజల్లుతోంది. వేసవి వచ్చినా దోమల బెడద అలానే ఉంది. చెత్తపై అవగాహన కల్పించాల్సిన అధికారులు మిన్నకుండి పోతున్నారు. ప్రత్తిపాడులో ప్రధానంగా హైవే రోడ్డు కింద ఏలూరు కాలువ గట్టున చెత్తను పోస్తున్నారు. రాజీవ్‌గాంధీ, రాజశేఖరరెడ్డి విగ్రహాల వద్ద ఉన్న ఖాళీ స్థలాలను డంపింగ్ యార్డులుగా ఉపయోగిస్తున్నారు, ప్రత్తిపాడులో ట్రిపుల్ కర్మాగారం నుంచి కృష్ణాయపాలెం వరకు ఏలూరు కాలువగట్టున నిత్యం చెత్తను వేయడం వల్ల అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్తను తొలగించుకొనేందుకు కాలువ పరిసర ప్రాంతాలలో ఉన్న ప్రజలు కాలువను డంపింగ్ యార్డుగా ఉపయోగిస్తున్నారు. చెత్తను డంపింగ్ యార్డులకు తరలించి వర్మీకంపోస్టుగా తయారు చేసుకొని ఆధాయాన్ని సమకూర్చుకోవాలన్న ఉన్నతాధికారుల ఆదేశాలను కార్యదర్శులు పెడచెవిన పెడుతున్నారు.

వ్యర్థాలన్నీ రోడ్ల పక్కనే..

మండలంలోని జాతీయ రహదారి ఇరువైపులా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఈ చెత్తకుప్పల వలన అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గాలి వీచినప్పుడు, వాహనాలు వేగంగా వెళ్లినప్పుడు చెత్త నుంచి కాగితాలు, పాలిథీన్ కవర్లు ఎగురొచ్చి వాహనాలపై పడుతుండడంతో డ్రైవర్లు వాటిని తీయబోయి ప్రమాదాల బారిన పడుతున్నారు. కాఫీ, భోజనం హోటళ్లు వంటి వ్యాపార సంస్థలు ఉండడంతో నిత్యం చెత్తను పట్టుకొని వచ్చి రోడ్డు పక్కనే వేస్తున్నారు. అంతే కాకుండా నిల్వ పదార్థాలను ఇక్కడే వేయడంతో ప్రజలు, వాహనదారులు ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇవేకాకుండా ఖాళీ కొబ్బరి బొండాలు, కోళ్లు, చేపల వ్యర్థాలు కూడా ఇక్కడే పడేస్తున్నారు. ఈ రహదారి ఇరువైపులా రాకపోకలు సాగించే వారికి నిత్యం ఆగచాట్లు తప్పడం లేదు. రాత్రిళ్లు వాహనాల వేగంతో పాటు ఈచెత్త నుంచి వచ్చే చెడు వాసనలు భరించలేకపోతున్నామని వాపోతున్నారు.

క్లుప్తంగా

ఏకేటీపీ పాఠశాల హెచ్ఎం రామకృష్ణకు ప్రథమ స్థానం



తణుకులో హెచ్ఎం రామకృష్ణకు బహుమతి అందజేస్తున్న తపాలా శాఖ అధికారులు

తణుకు అర్బన్: తపాలా శాఖ నిర్వహించిన జాతీయ స్థాయి లేఖారచన పోటీలు, ఢాయి ఆఖర్‌లో ఎన్వలాప్ కేటగిరి రాష్ట్రస్థాయిలో తణుకు ఏకేటీపీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం తాళాబత్తుల రామకృష్ణ ప్రథమస్థానాన్ని సాధించినట్లు తణుకు హెడ్‌పోస్టాఫీసు అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎం.సూర్యప్రకాష్ తెలిపారు. ప్రథమస్థానంలో నిలిచిన హెచ్ఎం రామకృష్ణకు పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో రూ. 23వేలు బహుమతిని తపాలా శాఖ అధికారులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ పోస్ట్‌మాస్టర్ సీహెచ్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్‌పర్సన్‌గా మంగా బాయి



తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా చాపల మంగా బాయి నియమితులయ్యారు. గతంలో ఉన్న పాలకవర్గం రద్దు కావడంతో కూటమి ప్రభుత్వం నూతన చైర్మన్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిలో భాగంగానే తాడేపల్లిగూడెం ఏఎంసీ చైర్‌పర్సన్‌గా మంగా బాయి నియమితులయ్యారు. మార్కెట్ యార్డు ఆవిర్భవించిన తర్వాత ఎస్సీ సామాజికవర్గం నుంచి తొలి మహిళా చైర్‌పర్సన్ మంగా బాయి కావడం విశేషం. ఈ సందర్భంగా ఆమెకు పలువురు అభినందనలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



తణుకులో మాట్లాడుతున్న సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు

తణుకు అర్బన్: పరిసరాల పరిశుభ్రత నిరంతర ప్రక్రియ అని, పాటించడంలో అలసత్వం వహిస్తే అనారోగ్యానికి బాటవేసుకున్నట్లని సబ్ యూనిట్ ఆఫీసర్ గుడిమెట్ల వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని సొసైటీ రోడ్డు ప్రాంతంలో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిరుపయోగ సామగ్రిని మునిసిపాలిటీ చెత్త సేకరణ సిబ్బంది వచ్చినపుడు అందజేయాలని, డ్రెయిన్‌లలో చెత్తపారవేసి మురుగునీటి పారుదలకు ఆటంకం కలిగించవద్దని సూచించారు. దోమ పుట్టుకకు బ్రేక్ వేయాలంటే ఖర్చురహితమైన ఈ విధానాలను పాటించి దోమల నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫైలేరియా కంట్రోల్ యూనిట్ సూపర్‌వైజర్ కె.సత్యనారాయణ, వార్డు హెల్త్ సెక్రెటరీలు కె.అనుషా సువర్ణ, బి.వెంకటరమణ పాల్గొన్నారు.

బలుసులమ్మకు విశేష పూజలు



మహిళలచే సౌభాగ్య పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉగాది మహోత్సవాలు పురస్కరించుకొని తాడేపల్లిగూడెం పురదేవత బలుసులమ్మ అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం అష్టలక్ష్మి ఆరాధన పూర్వక సామూహిక సౌభాగ్య కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. సుమారు రెండు వేల మంది మహిళలు ఈ పూజల్లో పాల్గొన్నారు. తొలుత అమ్మవారికి విశేష పూజలు ఆలయ అర్చకులు బ్రహ్మత్వంలో నిర్వహించారు. ప్రతి శుక్రవారం ఆలయం వద్ద భక్తుల సహకారంతో నిర్వహించే అన్నసమారాధనలో సుమారు 5 వేల మంది అన్నప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు శ్రీరంగం అంజి, ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని 33/11 కేవీ హౌసింగ్‌బోర్డు విద్యుత్ సబ్ స్టేషన్, కొండయ్య చెరువు సబ్ స్టేషన్, పాతూరు సబ్ స్టేషన్ పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ వర్క్స్, మరమ్మతుల నిమిత్తం ఈ నెల 29వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి వెల్లడించారు. విద్యుత్ నిలిపివేస్తున్నందున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మాజీ మంత్రి కొట్టు పరామర్శ



కర్రి భాస్కరరావు కుటుంబానికి సంతాపం తెలుపుతున్న మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : వైఎస్సార్ సీపీ నాయకుడు కర్రి భాస్కరరావు సోదరుడు కర్రి మల్లిఖార్జునరావు ఇటీవల గుండెపోటుతో మరణించారు. ఆయన కుటుంబ సభ్యులను మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పరామర్శించారు. వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నా జనార్దన్, ముప్పిడి సంపత్ కుమార్, వెలనాటి సత్తిబాబు, బోళెం రమణ, తదితరులు ఉన్నారు.

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



తణుకులో సత్కారం పొందిన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కామేష్ తదితరులు

తణుకు అర్బన్: తణుకు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. శుక్రవారం బార్ అసోసియేషన్ భవనంలో నిర్వహించిన ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కమిటీగా అధ్యక్షుడిగా సూరంపూడి కామేష్, ఉపాధ్యక్షుడిగా కలిదిండి పద్మావతి, ప్రధాన కార్యదర్శిగా చోడే గోపికృష్ణ, సహాయ కార్యదర్శిగా పొట్ల సురేష్, కోశాధికారిగా ఎం.మృత్యుంజయరావు, లైబ్రరీ కార్యదర్శిగా నాగార్జునదాస్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా కత్తుల జెస్‌పాల్, లేడీ రిప్రజెంటేటివ్ షేక్ మోతి, 10 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

విద్యుత్ భారాలు తగ్గించాలి



వేల్పూరులో విద్యుత్ శాఖ ఉద్యోగికి వినతిపత్రం అందజేస్తున్న చిన వీరభద్రరావు



ఇరగవరంలో ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

తణుకు అర్బన్: విద్యుత్ చార్జీలు పెంచడంలేదంటూనే టైమ్ ఆఫ్ డే టారిఫ్ వంటి విధానాన్ని చిరువ్యాపారులకు సైతం అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం దారుణమని సీపీఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ళ చిన వీర భద్రరావు విమర్శించారు. శుక్రవారం వేల్పూరు సీపీఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అధిక విద్యుత్తు వినియోగించే సమయంలో ఎంత విద్యుత్తు వినియోగించారోనని తెలుసుకోవడానికి స్మార్ట్ ప్రీ పెయిడ్ మీటర్లు వినియోగించి విద్యుత్తు చార్జీలు మోత మోగించడం దుర్మార్గమని అన్నారు. డిమాండ్‌ను బట్టి చార్జీలు విధించే దుర్మార్గమైన విధానాన్ని రాష్ట్రంలో విస్తృతంగా అమలు చేయడానికి అనుమతించడం సరికాదని వీరభద్రరావు విమర్శించారు. విద్యుత్ రంగంలో సంస్కరణలు అమలు చేసే రాష్ట్రాలకే ప్రోత్సాహకాలు, రాయితీలను ఇస్తామని కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ సమావేశాల్లో పేర్కొనడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి ట్రూ ఆప్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలన్నారు. అనంతరం విద్యుత్ శాఖ ఉద్యోగికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యండమూరి నాగేంద్ర, దున్నే రుద్ర నాగేశ్వరరావు, కుడకా వీరభద్రరావు, వాసా పోసియ్య, విశ్వనాథం సుబ్బారావు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి

ఇరగవరం: పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీపీఎం పార్టీ ఇరగవరం మండల కార్యదర్శి కామన మునిస్వామి స్థానిక ఇరగవరం విద్యుత్ సబ్ స్టేషన్ ముందు సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. కామన మునిస్వామి మాట్లాడుతూ ప్రజలు ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతుంటే ప్రభుత్వం విద్యుత్ రూపంలో అధనపు భారాలు వేయడాన్ని తప్పుపట్టారు. సర్దుబాబు చార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్‌మీటర్లు పేరుతో వేలకోట్ల రూపాయిలు ప్రజల నుంచి వసూలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. లేని పక్షంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. పిల్లి కోటేశ్వరరావు, నాగబాబు, గుత్తుల శివయ్య, గంగాధర్ రావు పాటియా పాల్గొన్నారు.

ఎన్ఎంయూఏ గేట్ మీటింగ్



తణుకు ఆర్టీసీ డిపో గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎన్ఎంయూఏ అధ్యక్షుడు ఏసుబాబు

తణుకు అర్బన్: ఆర్టీసీలో 1–2019 సర్క్యులర్‌ను పూర్తిగా అమలు పరచాలని, ఈ సర్క్యులర్ ప్రకారమే ఏపీపీటీడీలో విధి విధానాలు ఉండాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ అధ్యక్షుడు సరిదే ఏసుబాబు డిమాండ్ చేశారు. జోనల్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం తణుకు డిపో గ్యారేజ్ గేటు వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. తణుకు ఎన్ఎంయూఏ కమిటీ సహాయ కార్యదర్శులు సుభాషిణి, టిఎస్ రావు, అసిస్టెంట్ సెక్రటరీ పీఎస్ రాజు, పబ్లిసిటీ సెక్రటరీ కేడీ ప్రసాద్, కోశాధికారి ఎసీవీ రావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఉద్యోగుల అక్రమ సస్పెన్షన్‌లు రద్దు చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఎస్ ఆర్టీసీలో ఉద్యోగుల అక్రమ సస్పెన్షన్‌లు రద్దు చేయాలని కోరుతూ ఏపీపీటీడీ నేషనల్ మంజూర్డ్ యూనిట్ అసోసియేషన్ నాయకులు శుక్రవారం ఆర్టీసీ గ్యారేజీ వద్ద గేట్ మీటింగ్‌లో నిరసన తెలిపారు. వక్తలు మాట్లాడుతూ విజయవాడ జోన్, జోనల్ కమిటీ పిలుపు మేరకు విజయవాడ జోన్ పరిధిలోని అన్ని డిపోలలో 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్‌లు రద్దు చేయాలని, సస్పెన్షన్‌లో ఉన్న ఉద్యోగులను వెంటనే విధులలోకి తీసుకోవాలని కోరారు. పని ఒత్తిడి తగ్గించాలని, మహిళలకు చైల్డ్ కేర్ లీవులు ఇప్పించాలని, విజయవాడ జోన్ ఈడీకి సమర్పించిన సమస్యలతో కూడిన వినతిపత్రంలోని అన్ని డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు ఎం.శరత్‌బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.సూర్యచంద్రరావు, జోనల్ ఉపాధ్యక్షుడు ఎ.నాగేశ్వరరావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.భుజంగరావు, డిపో కార్యదర్శి ఎ.రవి కుమార్, సీసీఎస్ డెలిగేట్ పి.కొండలరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వినియోగదారుల చెంతకే విద్యుత్ కోర్టులు



అత్తిలిలో విద్యుత్ కోర్టులో మాట్లాడుతున్న డాక్టర్ సత్యనారాయణ

అత్తిలి: విద్యుత్ వినియోగదారుల వద్దకే విద్యుత్ కోర్టు సేవలు అందజేస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ కోరారు. అత్తిలి ట్రాన్స్‌కో కార్యాలయంవద్ద శుక్రవారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేదికలో 7 ఫిర్యాదులు అందాయని, ఒకరి ఆధార్ కార్డుపై మరొకరు విద్యుత్ మీటరు పొంది ఉన్నారని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గతేడాది 567ఫిర్యాదులు తమ కోర్టుకు వచ్చాయని, గత రెండు నెలల్లో 300 ఫిర్యాదులు రాగా, తమ పరిధిలోగల 11 జిల్లాల్లో 108 కేసులకుగాను నష్టపరిహారంగా రూ. 14,36,901 అందజేసినట్లు చెప్పారు. విద్యుత్ ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో బాధితులకు న్యాయం చేస్తామని, ఏ సమస్య అయినా రెండు సంవత్సరాల్లోపు తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో సభ్యులు బి.సురేఖారాణి, షేక్ బాబర్, ఏఈ కె.నాగరాజు పాల్గొన్నారు.

ఉమాచంద్రశేఖర్ స్వామికి అభిషేకాలు



శ్రీ ఉమా చంద్రశేఖర్ స్వామి

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాసవి పంచాయతన క్షేత్రంలో ఉమా చంద్రశేఖర్ స్వామికి శుక్రవారం పంచామృతాలతో, ఫలరసాలతో, సుగంధ ద్రవ్యాలతో, విభూదితో విశేష అభిషేకాలు జరిగాయి. ఆర్యవైశ్య సెక్రటరీ నున్న సుందరం, కోశాధికారి బోగవిల్లి రమేష్, పేరూరి కాశయ్య, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా మహంకాళమ్మ, మహాలక్ష్మమ్మ జాతర

పెంటపాడు: మండలంలోని పెంటపాడు గ్రామ దేవతలైన మహంకాళమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్ల జాతర ఉత్సవం శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవార్లను పూరిగుడి వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పసుపు, కుంకుమలతో పూజలు చేసారు. ఆసాదులు, బుట్ట బొమ్మలు, బాణసంచా ప్రచార సామగ్రితో అమ్మవార్లను ఊరేగించారు. అర్చకులు కొడవటిగంటి నరసింహాచార్యుల ఆధ్వర్యంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

కార్మికులతో వేతన ఒప్పందం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి పీఎం దాల్ మిల్లు యాజమాన్యానికి, కార్మికులకు మధ్య నూతన వేతన ఒప్పందం జరిగిందని ఇఫ్టూ జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దానవర ప్రసాద్ శుక్రవారం తెలిపారు. గత అగ్రిమెంట్ వేతనానికి అదనంగా ఎనిమిది శాతం కూలి రేట్లు పెంచడం జరిగిందన్నారు. 2025 ఏప్రియల్ 1 నుంచి 2027మార్చి 30వ తేది వరకు ఈ వేతన ఒప్పందం అమలులో ఉంటుందన్నారు. పీఎం దాల్ మిల్లు యాజమాన్యం ఎస్. సత్తిబాబు, దానిరెడ్డి, జట్టు కార్మికులు బి.వెంకట్రావు, రామిశెట్టి నాగేశ్వరరావు, నలగంటి కృష్ణ, ఆదియ్య పాల్గొన్నారు.

విజయవాడకు బస్టాండ్ నుంచి ఎక్స్‌ప్రెస్‌లు



మాట్లాడుతున్న డిపో మేనేజర్లు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తణుకు డిపో నుంచి విజయవాడ వెళ్లే అల్ట్రా డీలక్స్ బస్సులు తాడేపల్లిగూడెం డిపోకు వచ్చి వెళ్లేలా ఏర్పాట్లు చేసినట్లు తాడేపల్లిగూడెం, తణుకు డిపో మేనేజర్‌లు వై.ఎస్.ఎన్ మూర్తి, సప్పా గిరిధర కుమార్‌లు తెలిపారు. పట్టణంలో శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ తణుకు నుంచి వెళ్లే ప్రతి అల్ట్రా డీలక్స్ బస్సు ఇకపై తాడేపల్లిగూడెం బస్సు స్టాండ్‌కు వచ్చి వెళ్తాయన్నారు. తాడేపల్లిగూడెంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు బస్సు టైమింగ్స్ వివరాలు 9.10, 9.15, 10.40, 11.25, 12.25, 16.55, 17.40 సమయాల్లో గూడెం నుంచి బస్సులు తరలి వెళ్లతాయని చెప్పారు. ఈ సర్వీసులను ప్రయాణీకులు వినియోగించుకోవాలని కోరారు.

అందరిపై అల్లా దీవెనలు ఉండాలి

మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



పెద్ద మసీదులో మాట్లాడుతున్న మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : సమాజానికి ఆదర్శం రంజాన్ పండుగని మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక పెద్ద మసీదులో గురువారం ఆయన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందరిపై అల్లా దీవెనలు ఉండాలని కోరారు. హిందూ ముస్లింలు సోదరభావం, సహాయ గుణంతో పయనిస్తున్నారన్నారు. రంజాన్ పండుగ అన్ని వేసవి, వర్షాకాలం, సీతాకాలం పరిమితి లేకుండా అన్ని కాలల్లోను వస్తుందన్నారు. ముస్లిం సోదరులకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించి వారి అభివృద్ధికి మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో బాటలు వేశానరన్నారు. అల్లా కృప వల్ల ప్రజలందరూ సంతోషంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇమామ్ అన్వర్ కాస్మి సాహెబ్, అబ్దుల్ గని, షాజహాన్, మహ్మద్ రఫి, షేక్ షంషుద్దీన్, షేక్ మహబూబ్ బాషా, నౌషద్ మొహిద్దీన్, వలీబాషా, షేక్ మునూర్, సయ్యద్ ఆసిఫ్, కొలుకులూరి ధర్మరాజు, ముప్పిడి సంపత్‌కుమార్, గారపాటి వీరకుమార్, కునుపూరి భాస్కరాచార్యులు, జొన్నల సత్యనారాయణ, చామన సూచ్యచంద్రరావు, చామన ప్రసాద్, చెన్నా జనార్దన్, బొద్దాని శ్రీనివాస్, బోళెం రమణ, లంకా రాజశేఖర్, వార్డు ఇన్‌చార్జిలు సారిపల్లి రమణ, తగరంపూడి మురళి, అల్లు శ్యాంబాలాజీ, గుంబోయిన రామస్వామి, వైబోయిన మారుతి, పాలూరి శివ, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

పాస్టర్ పగడాల మృతిపై న్యాయ విచారణ జరపాలి



సమావేశంలో మాట్లాడుతున్న గూడెం క్రైస్తవ జేఏసీ నాయకులు

పెంటపాడు: పాస్టర్ పగడాల ఆకస్మిక మృతిపై ప్రభుత్వం తక్షణం న్యాయ విచారణ జరిపి, దోషులైన వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని గూడెం క్రైస్తవ జేఏసీ నేతలు పేర్కొన్నారు. శుక్రవారం ఆయా చర్చిలలో ప్రార్థనల అనంతరం గూడెం రామారావు పేటలోని క్రిష్టియన్‌పేట వీధి ప్రార్థనా మందిరంలో గూడెం క్రైస్తవ జేఏసీ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ సభ్యులు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో యువ ఉజ్జీవ ఆధ్యాత్మిక బోధకుడిగా ఎదుగుతున్న పాస్టర్ ప్రవీణ్ పగడాల హత్యపై నిజాలు నిగ్గు తేల్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు మానుకొండ డల్లా, మరనాత ఎలీషా, పాస్టర్ రవికుమార్, శామ్యూల్ మాస్టార్, బేబీ సరోజిని, లాల్‌నెహ్రూ, మెండెం జేమ్సు, పాస్టర వినోద్, టైటస్, ప్రసాద్, పాస్టర్ ఎజ్రా శాస్త్రి, దినకరన్, కరుణమ్మ, రాజబాబు, లూక్సన్, శ్యాంబాబు, తదతరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలకు ముఖాముఖీలు



పెంటపాడులో ఇంటర్వ్యూలు పరిశీలిస్తున్న ఎంపీడీవో బాలాజీ

పెంటపాడు: ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి ద్వారా లబ్ధిదారులు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎంపీడీవో సీహెచ్ బాలాజీ పేర్కొన్నారు. రెండు రోజుల నుంచి పెంటపాడు మండల కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న స్వయం ఉపాధి ఇంటర్వ్యూలు గురువారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఈ ఇంటర్వ్యూలకు ఆన్‌లైన్‌లో మండలంలోని అన్ని గ్రామాల నుంచి 1390 దరఖాస్తులు వచ్చాయన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 800 మంది హాజరయ్యారన్నారు. ఈ సందర్భంగా గూడెం, పెంటపాడు, దువ్వ, తిరుపతిపురం బ్యాంకులకు చెందిన సిబ్బంది అధికారులు ఇంటర్వ్యూలు చేశారు. ఈవోపీఆర్డీ ప్రసాద్, మండల కార్యాలయ సూపరెండెంట్ టీవీ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలు ప్రశాంతం

తాడేపల్లిగూడెం (టీఓసీ): నియోజకవర్గంలో పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా నిర్వహించారు. పట్టణంలో 8 రెగ్యూలర్, ప్రైవేట్ సెంటర్‌లలో జెడ్పీ ఉన్నత పాఠశాల, సుబ్బారావుపేట మునిసిపల్ ఉన్నత పాఠశాల, కడకట్ల కోడే వెంకట్రావు మునిసిపల్ ఉన్నత పాఠశాల, భాష్యం, శ్రీ చైతన్య, నారాయణ, కింబర్లీ, సెంట్‌జోన్స్ సెంటర్‌లలోను అదే విధంగా రూరల్ మండలంలో మాధవరం జెడ్పీ పాఠశాల, ఆరుగొలను ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ, కొమ్ముగూడెం జెడ్పీపాఠశాల, పెద్దతాడేపల్లి జెడ్పీ పాఠశాలలోను పెంటపాడు మండలంలోని మీనవల్లూరు, అలంపురం, పెంటపాడు జెడ్పీబీఎస్, జూనియర్ కళాశాలలో పది పరీక్షలు జరిగాయి. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. పరీక్షకు హాజరుకావాల్సిన వారు మొత్తం విద్యార్థినీ, విద్యార్థులు 3,525 మంది కాగా 3,420 మంది హాజరయ్యారు. 105 మంది హాజరు కాలేదు. స్క్వాడ్ అధికారులు ఆయా కేంద్రాలను తనిఖీలు చేశారు.

వైఎస్సార్ సీపీకి కింది స్థాయి నుంచే ప్రజాదరణ

పెంటపాడు: ప్రజలకు ఏమీ చేయలేని కూటమి ప్రభుత్వం స్థానికంలో గెలవాలని ఎన్ని ప్రయత్నాలు చేసినా కింద స్థాయిలో వైఎస్సార్ సీపీకి ఎంతటి ప్రజాదరణ ఉందో తెలుస్తోందని పార్టీ మండల మాజీ అధ్యక్షుడు వల్లూరి బ్రహ్మానందం పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ తన అభిప్రాయాన్ని పంచుకొన్నారు. అత్తిలితో పాటు పలు ప్రాంతాలలో మండల పరిషత్ ఎన్నికల్లో కూటమి శ్రేణులు ఎంత బరితెగించినా ప్రజల నుంచి, ఎంపీటీసీ సభ్యుల నుంచి పార్టీని విడదీయలేదన్నారన్నారు. ప్రస్తుత పరిస్థితిలో ఆ విషయం రుజువైందన్నారు. కొండేపాడు మాజీ ఎంపీటీసీ సభ్యులు పాలా గణపతి, కోరుమిల్లి సొసైటీ మాజీ త్రిసభ్యకమిటీ సభ్యుడు దేవరశెట్టి రాంబాబు పార్టీ నాయకులు పాల్గొన్నారు.